# రాగమాలిక ::

రచన:
శ్రీ గోటేటి జగన్మోహనరావు

అక్కడ—ఆ నదీతీరాన్ని—యిసుకతిన్నెమీద...

ఏదో—ఎందుకో—గాఢంగా ఆలోచిస్తున్నాడు రెప్ప వాల్చకుండా అస్తమిస్తున్న ఆ సూర్యుడికేసి చూస్తూ—రాము.

ఆకాశంలో మారే రంగుల్లో తనూ నిమిషానికో లాగ, క్షణానికో లాగ—మారిపోతున్నాడు!

కొంతసేపయాక—"రాగ!—" అన్నాడు గద్గదస్వరంతో.

ఏం భావన యిది?—అతనికే అర్థంకావాలి!

—హఠాత్తుగా తన జీవితంమీదికి పోయింది మనస్సు!

పరిగెడుతూన్న మేఘాల్లాగా అతని కళ్ళముందు చరచరా కదలిపోయాయి జీవితంలో తన పూర్వఘట్టాలు!—...

...తను చిన్నవాడప్పుడు—చాలా చిన్నాడు.

ఎందుకో దేవుడు తన తండ్రిని దక్కనియ్యలేదు మూడో యేటే.

—తండ్రి రిక్షా లాగేవాట్ట!—వచ్చే డబ్బులు కూటికి సరిపోయేవి కావు. ఒక్కడే కొడుకవటం చేత చాలా గారాబంగా పెంచారు తన్ని.

తనకి మూడో యేడు వచ్చినప్పటినుంచీ అమ్మే కూలిచేసి డబ్బు తెచ్చేది. ఎంత కష్టపడేదో పాపం!—తనకి చిన్నవయస్సు—ఏం తెలుస్తుంది!

తన ఎనిమిదో యేడు—తల్లి రైళ్ళలో ధర్మం అడుక్కు తెచ్చుకోమని చెప్పింది. అవును—అంతకంటె ఏం చెయ్యగలదు?—వాళ్ళ స్థితి అలాంటిది.

తను అలాగే అడుక్కుంటూండేవాడు. రైల్లో నాలుగు స్టేషన్ల వరకూ వెళ్ళి తిరిగి వస్తూండేవాడు. మొదటి ఆరు నెల్లలోనూ పడరాని కష్టాలు పడవల్సొచ్చింది పాపం!—ఎన్ని తన్నులు తిన్నాడో—ఎన్ని తిట్లు పడ్డాడో—లెఖ్ఖలేదు... కాని రానురాను కొన్ని కిటుకులు తెలుసుకోగలిగాడు—ఎన్నెన్నో రకాల మనుష్యుల్ని కుతూహలంగా పరికిస్తూండేవాడు.

ఒక రోజు!

తనూ, మరో అమ్మాయీ, రైలు వెనక ద్వారంనుంచి కిందికి దిగారు. ఆ అమ్మాయి పట్టాలమీద చతికిలబడింది... ఆ అమ్మాయికి ఎదురుగుండావున్న రైలుపెట్టి ఎక్కబోతున్నాడు తను.

"ఏ అబ్బాయ్....కొంచెంసేపు యిక్కడే వుండవూ... మరో బండిలో యిద్దరం వెళ్ళిపోదాం." అంది ఆ చిన్నమ్మాయి.

"ఎందుకేవిటి?' కరగ్గా అడిగాడు తను.

"అబ్బ!—నాకు తలనెప్పొస్తోంది—యిక్కడే వుండవూ కాస్సేపు?"

"సరేలే."

ఒక గంట వరకూ ఆ అమ్మాయితో అక్కడే కూర్చున్నాడు. రెండూ చిరుతహృదయాలే, స్వేచ్ఛగా మాటాడుతున్నాయి.

ఇంతలో రైలొచ్చి ఆగింది స్టేషనులో. ఇద్దరూ ఒకే పెట్టె ఎక్కారు. తనొకపాట—ఆ అమ్మాయి రెండుపాటలూ పాడారు. ఎన్నో డబ్బులు పోగయాయి ఆ పెట్టెలో. సంతోషంగా యిద్దరూ పంచుకున్నారా డబ్బుల్ని.

"ఇక్కణ్ణుంచి యిద్దరం కలిసి ధర్మం అడుక్కుందాం— ఏం" అన్నాడు తను.

"అలాగాలే"

"అవునుగాని, నీ పేరేవిటి మరి?"

"రాగమాలిక అంటాడు నాన్న!"

"రాగమాలిక—చాలా బాగుందికదూ పేరు?——నేను రాగా అని పిలుస్తాను ఒప్పుకుంటావా?—"

"రాగా!—ఆ పేరే ఎంతో బాగుంది నాకు!"

...... ...........

అవాళనుంచీ ప్రాణస్నేహితులు తనూ రాగా—అలా—ఆరేళ్లు—ఏడేళ్ళు! గడిచిపోయాయి!

—బిచ్చం ఎత్తుకుంటూ వున్నా తనూ—రాగా, ఎంత సంతోషంగా వుండేవాళ్లు!

—ఆ... స్టేషను వెనక ప్లాట్ ఫారంలో తనూ రాగా... రాత్రిళ్లు ఎన్నెన్ని కబుర్లు చెప్పుకునేవారూ!—ఎన్ని పాటలు పాడేదో రాగ!—...అబ్బ!—రాగ పాడితే ఎందుకో తన హృదయం పొంగిపోతూండేది.

ఈ నదీతీరాన్ని—ఇక్కడే—ఈ యిసుక తిన్నెమీద ఎన్నిసార్లు రాగా తనూ నిద్రపోలేదూ! ...ఎన్ని మధుర శరద్రాత్రులు గడిచిపోయాయో—అలా!

"రాగా నువ్వు ఎంతో మంచి పిల్లవి!" అన్నప్పుడల్లా—"నువ్వు మంచిపిల్లాడివి కాదా"...అని ఎంత ఆత్మవిశ్వాసంతో అనేదో రాగ—అంత చిన్నప్పుడు కూడా!—

తనూ రాగా కలిసి ఒకరాత్రి—ఆకలిబాధకి ఆగలేక పళ్లు దొంగిలించలేదూ!—ఎన్నిసార్లు ఎంత సహాయంచేసేదో తనకి రాగ—రాగతో గడిపినన్నేళ్ళూ తనకేవిటో బాధ అనిపించనేలేదు!—ఇప్పుడు...ఏమిటీ అనంత విషాదగీతం?—ఏమిటీ తీరని బాధ—అగుపడని ఆవేదన—రాగ లేకపోవడం వల్లనేనా?

బాగా జ్ఞాపకం!—తన పదిహేడో ఏట ఒకరోజున రాగ ఒక ముసిలాడితో స్టేషనుకి వచ్చింది. రాగ తండ్రి అతను—అంతవరకూ అతన్ని తను చూడలేదు. అతడికి జబ్బుగా వుంటూందనీ తను ధర్మం ఎత్తుకునే డబ్బుతో బియ్యం కొనుక్కుని నాన్నకి వండిపెట్టాలని ఎప్పుడో ఒకసారి చెప్పింది రాగ—మరి తర్వాత అట్టేసార్లు అతని ప్రసంగతే రాలేదు.—ఆవాళ రెండు మూడు సార్లు తను రాగతో మాట్లాడాడు. సాయంత్రం!...మళ్ళీ ఒకసారి మాటలాడబోయాడు రాగతో...

...అప్పుడు రాగ తండ్రి చూసిన—ఆ చూపులో ఎంత తీక్ష్ణతవుంది!

ఎంత కరకుతనం వుంది ఆ దృష్టిలో!—

"వీడెవడు సైతానులా...నువ్వు కనబడినప్పుడల్లా మాట్లాడుతాడు?" గర్జించాడతను సింహంలాగ.

"చాలా రోజులు మేం యిద్దరం కలిసి ముష్టెత్తుకునేవాళ్ళం!—"

ఆ మాటవింటూనే రెక్కపట్టుకుని లాక్కెళ్లిపోయాడు రాగని.

ఏం దీనంగా చూసింది తనవేపు రాగ!...ఆ చూపు తన జన్మలో మరిచిపోలేడు తనూ!—

మర్నాడు రాగ వస్తుందని చూశాడు ఆతురతతో, స్టేషను చుట్టుపట్లంతా—

ఏదీ రాగ?—అంతసేపైనా రాలేదే—!

నెల్లాళ్ళు గడిచాయి...,మరి రాగ కనబడలేదు!—

ఎందర్నో చూసి రాగ అని భ్రమపడేవాడు. రైల్లోపాడే ప్రతి అమ్మాయీ రాగేమోనని ఉలిక్కిపడి చూస్తూండేవాడు ఎన్నోసార్లు తను!

తన హృదయంలో తీరని ఆవేదన!—అంతులేని ప్రళయం! క్షణం ఒక యుగంలా గడిచింది నెలంతా.

రాగని చూడకుండా తను ఎలా వుండగలడు?—రాగ! రాగ!—అని తన హృదయం పలవరించిపోతూంది. ప్రకృతి అంతా "రాగ" అంటూన్నట్టు కనిపించింది తనకి.

ఆవాళ...ఒక రైల్లో ఎక్కాడు...ఎంతవరకూ అది వెళితే అంతవరకూ వెళదామని. పదహారో, పదిహేడో స్టేషన్లు గడిచాయి.

...మళ్ళీ రైలు...ఆగింది.—...కదిలింది.—

ఒకమూలనుంచి ఒక చక్కనిపాట!—కళ్ళు మూసుకున్న తను ఉలిక్కిపడి చూశాడు!—

"రాగ!"—ఇది తనకి అలవాటేనేమో కదూ!

కాని...యిప్పుడు...మాత్రం...

ఒక్కసారిగాపట్టరానినవ్వు వచ్చింది. ఛట్టున లేచాడు.

నిజంగా ఆమె రాగ!

—ప్రక్కనున్న రాగ తండ్రి!—

తను ఎలా రాగని పలకరించటం?—మానేశాడు.

అందర్నీ ముష్టిఅడుక్కుని తనదగ్గిరికి వచ్చింది రాగ!...

...ముఖం వికసించింది... కాని ఎలా మాట్లాడటం?...

'తండ్రి—అకాలరాక్షసుడు—అవాళ ఎంత గట్టిగాకొట్టాడో తనని!"—రాగ హృదయం పరితపించింది. రెండు వేడి కన్నీటిబొట్లు జారాయి మెల్లిగా ఆ నునుబుగ్గలమీంచి.

రెప్పవాల్చకుండా చూశాడు తను రాగ కళ్ళల్లోకి.

రాగ తన్ని మరిచిపోలేదు!—ఎలా మరిచిపోతుంది?—

రైలు ఆగింది—మూలనున్న తండ్రిని లేవదీసి ఆపెట్టె దిగి వెళ్ళిపోయింది రాగ!...మళ్ళీ అదీనమైన చూపు! "హృదయం దహించేస్తున్నావు రాగా నువ్వు నిజంగా!"

"తనూ వెళితే!"—"రాగ తండ్రి" అంది హృదయం అమాంతంగా. నిజంగా అతను కఠోరుడు!—తను అతనికి కనబడి రాగ నెందుకు కష్టపెట్టాలి?—

మరి రాగ కోసం చూడలేదు తను.

ఏదో బుద్ధిపుట్టి యింకా రెండుస్టేషన్ల అవతలే దిగిపోయాడు.

రాత్రి పదకొండు గంటలు!

స్టేషను ప్రక్క రాతిమీద కూలబడ్డాడు తను.

ఇంకా ఎవరో కూడా పడుకున్నట్టున్నారు ఆ రాతిమీదే!

"ఎవరు—" అంది ఒక ఆడ గొంతు.

"రాగా!" అప్రయత్నంగా అన్నాడు తను—ఆ కంఠం తనకి చిరపరిచితం కదూ...

—ఉలిక్కిపడి లేచింది రాగ.

వెంటనే దూరంగా తొలగిపోయారు ఇద్దరూ.

"రాగ!—నా హృదయం దహించేస్తున్నావు సుమా నువ్వు!"

"నేనేం చెయ్యను—మా నాన్న అలాంటి వాడు—"

"నేనంటే అంతకోపం ఎందుకు మీనాన్నకి—ఆ కరకుచూపుల్తో నన్నెందుకలా చీల్చాడా రోజున—?"

"దానికి కారణం వుందిలే.—ఆరోజున నన్నెన్నిదెబ్బలు కొట్టాడో నాన్న."

"నాగురించి నీకు దెబ్బలా—రాగ!—నేను నిజంగా క్రూరుణ్ణి!—"

"నీకోసం నేను ప్రాణాలైనా త్యజిస్తాను—రామం! నువ్వు లేకపోతే నేనెలా బ్రతకగలను!"

"మీనాన్న ఏడీ యిప్పుడు?"

"తాగ...దానికి..."

"తాగుతాడు!—అబ్బా—ఘోరం!—"

"నువ్వింక వెళ్లిపో—నాన్న వచ్చేవేళైంది...చూస్తే యిద్దరి ప్రాణాలూ దక్కవు."

"ఎందుకు నేనంటే మీనాన్నకి కోపం చెప్పు—వెళ్ళిపోతాను."

"మా...నాన్నకి...ఒక వుంపుడుకత్తె వుంది. అదీ ముష్టెత్తుకుని జీవిస్తూంటుంది. మా నాన్నకు అది—"రాగని డబ్బున్నవాడి కెవడికేనా అమ్మితే వచ్చేడబ్బు పెట్టి యిద్దరం సుఖంగా వుండొచ్చు"—అని సలహా చేస్తూంటుంది. ఈమాట నేనెన్నోసార్లు

విన్నాను నా చిన్నప్పుడు...—కాని లక్ష్యపెట్టలేదు—"ఎదగనీ, యింకా అది చిన్నపిల్ల"—అంటూండేవాడు నాన్న.—ఆవాళ నువ్వు కనిపించావే—అప్పటినుంచీ అనుమానం! తన ఉద్దేశానికి అడ్డొస్తావనే బాధ!...అందుకే నన్నింతదూరం తెచ్చాడు! ఇంక వారంరోజుల్లో నే నమ్ముడుపోతాను!"

"వారం రోజుల్లో!— ఎంత ఘోరవార్త రాగా!—"

"రామం!—మా నాన్నకి ధనంతో తులతూగుతూ భోగాలు అనుభవించాల నే వాంఛ యీ ముసలితనంలో కూడా!—ఎన్నాళ్ళనుంచి హృదయంలో గంతులేస్తోందో ఆ వాంఛ!"

"రాగా! రా...యిద్దరం వెళ్ళిపోదాం—నాన్నకి ధనం కావాలంటే నేను దొంగతనం చేసైనా తెచ్చియిస్తాను—కాని నీ మా నాన్ని మాత్రం పాడు డబ్బుకోసం బలివ్వకు!..."

అప్పుడే సరిగ్గా రాగ తండ్రివచ్చాడు. చేతిలో వున్న బుడ్డిని తనమీదకి విసిరాడు.—అప్పుడే కదూ తగిలింది తనకి బలమైనగాయం తలమీద!—రాగ పాపం కేకవేసి పడిపోయింది. తనని ఎంతదూరం తరిమాడా ముసిలాడు!... ..

మరి అంతే. ఇంకా తనకి రాగ కనబడలేదు.

జీవితం వృధా అనిపిస్తోంది. రాగని విడిచి యిరవైరోజులైనా ఎంత దుర్భరంగావుంది జీవితం!—పాపం! రాగ గతేమయిందో ఆ అవాంతరంలోంచి రాగని కాపాడలేని తన బ్రతుకెందుకు?—నిజంగా తను పశుతుల్యుడు!......

* * *

రామానికి తెలియకుండానే సూర్యుడస్తమించి పోయాడు. తన ఆలోచనల్ని బలవంతంగా అపుదామని ప్రయత్నిస్తున్నాడు. పాపం తల్లి కూడా చనిపోయింది నాలుగేళ్ళక్రితం.

ఇప్పుడు రామం ఏకాకి. తన రాగ—ప్రియమైన రాగ—తన లేదు—యిక రాదు! ఎలా తను జీవించటం?

ఇసుకతిన్నెనుంచి లేచాడు. ఇటూ అటూ పచారుచెయ్యటం మొదలు పెట్టాడు. ఎంతసేపైందో!

వెన్నెలపుచ్చ పువ్వులా వుంది. కాని వెన్నెలలో రామాని కింపని?—,

రాత్రి పన్నెండు గంటలు!

నిద్ర?—అది ఎలాంటిదో కూడా తెలియదిప్పుడు రామానికి.

ఉండి ఉండి దృష్టులు కొంచం దూరానికి వెళ్ళాయి.

ఎవరిది?—అల్లా పరుగిడి వస్తున్నారు?

ఎవరో స్త్రీ—రాగ కదూ!—

రాగ! అసంభవం— మరి అయితే ఎవరామె?

"ఆ వ్యక్తి రాగ! ముమ్మాటికీ రాగ!"—

ఛీ! ఏమిటీ భ్రమ—అసలు స్త్రీయే కాదు—ఎవరో పురుషుడు—పురుషుడే!

ఎవరతను?—అర్ధరాత్రి—నదివైపుకి—ఎందుకా పరుగు?

రామం గుండె దడ హెచ్చుతూంది. ఏదైనా ఆ వ్యక్తిని కలుసుకు తీరాలి!—అటువైపు—ఆ వ్యక్తి కోసం—పరిగెట్టాడు,

"ఎవరు నువ్వు? — ఎందుకలా నదిలోకి—రాత్రివేళ"

ఆ వ్యక్తి వులిక్కిపడి వెనక్కి చూచాడు.

రామం దగ్గరికి క్షణంలోవచ్చి—కళ్ళల్లోకి చూచాడు...

"ఎవరిది?—నాయనా నువ్వా!"

అదిరిపోయాడు రామం...అతనే రాగ తండ్రి! ఆశ్చర్యం!

"క్షమించు నేను ద్రోహిని—రాక్షసిని—! క్షమించు"—చచ్చిపోనియ్యి నన్ను వణుకుతున్నాడా ముసిలాడు!

అతణ్ణి పట్టుకుని నెమ్మదిగా యిసుకతిన్నెపైకి చేర్చాడు రామం.

ఎందుకు?...ఏమిటి కారణం నువ్విలా—యింతదూరం—యిక్కడికి రావటానికి?

"నాయనా—ఏం చెప్పగలను...కూతుర్ని డబ్బుకోసం, పాపిష్టి ధనంకోసం ఒక క్రూరుడికి కఠినుడికి అమ్ముకున్న పిశాచిని!... ఆ ధనం...అంతా ఒక కపట ప్రేయసికి—దొంగకి—ధారపోసుకున్నాను!—నన్నెంత మోసం చేసిందా రాక్షసి! రెండువిధాలా చెడ్డవాణ్ణి! నా కెవరింక దిక్కు? చావనీ! యీ పాపిని — యీ నదిలో చావనీ"

"ఎందుకలా విచారిస్తావు?—ఉద్వేగం ఆపుకో—రా పోదాం రాగని వెదుకుదాం....ఆ మానవతిని కాపాడదాం."

"అంతదూరం?-...పద...-మన అదృష్టం!"

రామం రాగ కోసం ఎంత తిరిగాడో,—కాని ఏదీ రాగ?—

ఆ క్రూరుడు అక్కడ లేనేలేడు—వున్నా తనో ముష్టాడు వాడికేం లెక్క!

అత నెవడసలు?-మరి రాగ నేంచేశాడు? రాగ విషయం తనకి చెప్పేవారెవరు?—అయినా అమ్ముడుపోయిన రాగ మళ్ళీ ఎలా వస్తుంది!—ఏమీ అర్థంకాకుండా వుంది రామానికిప్పుడు.

అయినా రోజూ నిద్రపోరాలులేక అలా తిరుగుతున్నాడు రాగకోసం...పాపం! తనతో ఆ ముసిలాడు కూడానూ!—ఎంతని అలా తిరగటం?...

విసిగి యింక రాగమీద ఆశ వదులుకున్నారిద్దరూ. కనబడిన రైలెక్కటం వూరూరూ పిచ్చాళ్ళలాగ తిరుగుతూండటం వాళ్ళపని యిప్పుడు. అంతే!

ఆర్. ఆర్. బ్రదర్స్ అండ్ కో.,
మిషనరీ వ్యాపారులు
బస్స్టాండు సమీపం, : : మదనపల్లి.

బియ్యపు హల్లర్లు, పిండి, మిర్చి, శీకాయ మున్నగువానిని పొడిచేయుటకు తగిన మిషనులను, వాటికి కావలసిన చిల్లరసామానులు, బెల్టు వగైరాలు మావద్ద దొరకును.

వెల సరసము. ఘట్టి పనితనము.

R. R. BROTHERS & Co.,
MACHINERY MERCHANTS
306, LINGI CHETTY STREET, : : G. T. MADRAS.